క్లుప్తంగా

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సీవీ కొండయ్య

చిప్పగిరి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా చేపట్టిన గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గృహనిర్మాణ శాఖ అధికారులను ఎంపీడీఓ కొండయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, నాగభూషణం, సిసింద్రి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ పాదాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠ పూజాకార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మద్దికెర : స్థానిక ఎస్సీ కాలనీలో వెలసిన దుర్గమ్మ అమ్మవారి పాదాలను మంగళవారం కాలనీవాసులు ప్రతిష్ఠించారు. ముందుగా అమ్మవారి కట్టను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, అష్టోత్తరనామార్చన, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు వినిమయం చేసిన అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

మొబైల్ ఆధార్ సేవలకు విశేష స్పందన

చిప్పగిరి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొబైల్ ఆధార్ సేవలకు విశేష స్పందన వచ్చింది. మండలంలోని ఏరూరు, రామదుర్గం గ్రామాలలో మంగళవారం మొబైల్ ఆధార్ క్యాంపింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్‌లో తప్పొప్పులు సరిచేయడం తదితర సమస్యలు పరిష్కరిస్తున్నారు. ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి ఆధార్ కార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఈ 25 వరకు మొబైల్ ఆధార్ సేవలు కొనసాగుతుందని ఎంపీడీఓ కొండయ్య తెలిపారు.

23 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డు సచివాలయ సిబ్బంది 23 మందికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం పట్టణంలోని క్రాంతి నగర్, హరిజనవాడ 1, 2 సచివాలయాలతో పాటు గిప్సన్‌కాలనీ, కిబులా క్వాటర్స్ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాజరు పట్టికలను పరిశీలించగా.. సిబ్బంది గైర్హాజరు తదితర అంశాలను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు వార్డుల పరిధిలో నిర్మాణాల్లో వున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లను పరిశీలించారు.

26న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి, జరగాల్సిన పనులతో పాటు అజెండలోని అంశాలపై చర్చిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖాలకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి ఒక రోజు ముందుగానే పంపించాలని ఆమె అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

వెల్దుర్తి: పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని ఎంఈఓ ఇందిర అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని సూదేపల్లె ఎంపీపీ స్కూల్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు, ఇటీవల జరిగిన ఎఫ్ఏ-1 పరీక్షల ఫలితాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మనబడి నాడు ఫేస్-2లో భాగంగా నిర్మితమవుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. సూదేపల్లె పాఠశాలలో పిల్లల పఠనాశక్తిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక శ్రీవీరనాగమ్మ, గంగభవాని దేవాలయ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని ఆలయ నూతన కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఆలయ కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రిటైర్డ్ హెచ్‌ఎం మాధవస్వామి, అధ్యక్షుడిగా పోతుల తిమ్మయ్య, ఉపాధ్యక్షులుగా పోలీస్ తిక్క రాముడు, కార్యదర్శిగా వీరేష్, సహాయకార్యదర్శిగా గోవిందు, కోశాధికారిగా నక్కల మిట్ట పెద్ద ఆంజినేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు.

కృష్ణమ్మ వచ్చె.. భూగర్భ జలాలు పెరిగె

- హంద్రీ-నీవా నీటితో బోరుబావుల్లో సమృద్ధిగా నీరు
- ఎండుతున్న పంటలకు జీవం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మద్దికెర మండలంలో ప్రవహిస్తున్న హంద్రీ-నీవా కాలువ



కళకళ లాడుతున్న నీటి కుంట

మద్దికెర : హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువలో పారుతున్న కృష్ణా జలాల కారణంగా మండల పరిధిలోని బురుజుల, పెరవలి, హంప, ఎడవలి, బొజ్జనాయుని పేట, మద్దికెర గ్రామాల పరిసర ప్రాంతాలలో బావులు, వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైర్లకు జీవం..

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఎండు ముఖం పట్టడంతో రైతన్నలు ఆందోళన చెందారు. ఈ తరుణంలో ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలను విడుదల చేయడంతో పంటలకు ఊపిరిపోసినట్లయ్యింది. ఆయకట్టు పొలాలే కాకుండా కాలువ పరవహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడంతో రైతన్నలు పైర్లకు నీరు పారించుకొని, పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మహానేత చలువతోనే..

మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాయలసీమ జిల్లాలు చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు ప్రాంతాలను అభివృద్ధి చేయడమే గాకుండా సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన భగీరథ ప్రయత్నంలో భాగంగానే హంద్రీ-నీవా కాలువ తవ్వించారు. ఆయన చలువతోనే కృష్ణా జలాలు కర్నూలు జిల్లాలోని తమ ప్రాంతానికి చేరాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో వర్షాభావంతో పైర్లు ఎండిపోవడమే కాకుండా భూగర్భ జలాలు అడుగంటి బావుల్లో సైతం నీరు లేక పంటలు సాగు చేయలేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే హంద్రీ-నీవాకు నీటి ప్రవాహం ప్రారంభమైనప్పటి నుంచి బావులు, బోర్లు నీటితో కళకళ లాడడమే గాకుండా రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. దీంతో కాలువ పరివాహక ప్రాంతాల్లో పంటలు సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

బావుల్లో నీటి మట్టం పెరిగింది



మాది బసినేపల్లి గ్రామం. అయితే ఎడవలిలో పొలాలు వున్నాయి. కాలువ పక్కనే వ్యవసాయ బావి వుండడంతో హంద్రీ-నీవా కాలువ వల్ల బావుల్లో నీటి నీటి మట్టం పెరిగింది. ప్రతి ఏటా వరి, మిరప వంటి పంటలు సాగు చేసుకుంటున్నాం. నీరు సమృద్ధిగా వుండడం వల్ల పంటలు సాగు చేస్తున్నాం.

– చౌడప్ప, బసినేపల్లి

అదనపు పంటలు వేసుకోవచ్చు



బావుల్లో నీరు ఉండడం వల్ల ధైర్యంగా పంటలు వేసుకోవచ్చు. కాలువలో నీరు ప్రవహిస్తుంటే బావుల్లో నీరు సమృద్ధిగా వుంటుంది. దీంతో అదనంగా పంటలు సాగు చేసేందుకు ధైర్యంగా వుంటుంది. హంద్రీ-నీవా వల్ల బావుల్లోనే కాక గ్రామాల్లోని బోర్లలో కూడా నీటి మట్టం పెరిగింది.

– నాగరాజు, మద్దికెర

నేడు తెర్నెకల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

దేవనకొండ : మండలంలోని తెర్నెకల్ గ్రామంలో బుధవారం జరిగే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరవుతారని జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, కో-కన్వీనర్ కబీర్‌దాసు మంగళవారం విలేకరులకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్నిశాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

385 రేషన్ కార్డులు మంజూరు

తుగ్గలి : మండలంలో అర్హులైన పేదలకు 385 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 19,009 రేషన్ కార్డులుండగా, వీటికి కొత్తగా 385 కార్డులు జమయ్యాయి. మంజూరైన రేషన్ కార్డులకు సంబంధించి ఆయా సచివాలయాల్లో డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తహసీల్దార్ రవి తెలిపారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు. నాయకులు రాముడు, తిమ్మగురుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు ఈ నెల 24 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితా పరిశీలనకు వచ్చే బీఎల్వోలకు సహకరించి తప్పులున్నా, కొత్త ఓటర్ల నమోదుకు, అలాగే అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిని ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చనని చెప్పారు. చివరికి తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్‌శర్మ, నిత్యానంద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు, వీఆర్వో షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ సర్వేకు 25 వరకు గడువు

హాలహర్వి : ఈనెల 25వ తేదీ వరకు ఓటరు సర్వేకు గడువు ఉందని ఎంపీడీఓ ఆంతోని తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీఎల్‌వోలు ప్రతి గ్రామంలో ఓటర్ సర్వే చేపడుతున్నారన్నారు. కొత్తగా ఓటర్ నమోదు చేసుకునే వారు, చేర్పులు, మార్పులు చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారదర్శక పాలనకు నిదర్శనం సీఎం జగనన్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలనకు నిదర్శనంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఉప్పర కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి జేసీఎస్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే జేసీఎస్ కన్వీనర్లకు రూ.2లక్షలు, గృహసారథులకు రూ.1లక్ష బీమా సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో అన్ని అమలు చేసి సంక్షేమ పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని మరోమారు గెలిపించేందుకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కన్వీనర్లు, గృహసారథులు రథసారథులుగా వ్యవహరించాలన్నారు. ప్రజా సంక్షేమానికి నవరత్నాలతోపాటు మరెన్నో పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వ తీరును ప్రజలకు బాధ్యతగా చేరవేయాలని సూచించారు. అవ్వతాతలకు ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా ఇళ్లకే వెళ్లి పింఛన్లను అందిస్తుండటంతో ప్రజలు జగనన్న పాలనకు జైకొడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణం, మంచినీరు, డ్రైన్ల సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే పట్టణంలో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌హమ్మద్, సీనియర్ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, భీమిరెడ్డి, బందెనవాజ్, శివప్పగౌడ్, కాశిరెడ్డి, విరుపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, బంగిశ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహించండి



హంద్రీనీవా కాలువ వెంట నాటిన మొక్కలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

కృష్ణగిరి: నీటి సదుపాయం ఉన్న రైతులు పండ్ల తోటల సాగు చేసేలా ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన కృష్ణగిరి సమీపంలో ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన పండ్ల మొక్కలను, హంద్రీనీవా కాలువ వెంట నాటిన అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈఏడాది పండ్ల తోటల సాగును లక్ష్యానికి మించి సాగు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కృష్ణగిరిలో ఇప్పటి వరకు 200 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఆయా గ్రామాల సిబ్బందిపై ఉంటుందన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, టీఏలు శేషిరెడ్డి, ఉశేన్, చెన్నకేశవులు, ఫీల్డ్ అసిస్టెంట్ సుభాష్ ఉన్నారు.

కృష్ణగిరి రిజర్వాయర్‌లోకి నీటి విడుదల



రిజర్వాయర్‌లోకి నీరు వెళ్తున్న దృశ్యం

కృష్ణగిరి: హంద్రీ-నీవా ప్రధాన కాలువ నుంచి కృష్ణగిరి రిజర్వాయర్‌లోకి మంగళవారం హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ రిజర్వాయర్ 0.61 టీఎంసీ సామర్థ్యంతో ఉందని డీఈ చిన్నయ్య తెలిపారు. ఈఏడాది పూర్తి సామర్థ్యంతో నీటిని నింపుతున్నట్లు తెలిపారు. రిజర్వాయర్‌లోకి 50క్యూసెక్కుల నీటిని వదిలామన్నారు. దీని కింద 5,100 ఎకరాల ఆయకట్టుకు నీరు పారుతుందని చెప్పారు. హంద్రీనీవా కాలువ 12 అడుగుల లోతుతో నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని, రైతులు ఎవరు కాలువలోకి దిగవద్దని హెచ్చరించారు.

సేవలే చిరకాలం గుర్తుంటాయి



ఎంఈఓ వినోద్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోనెగండ్ల : ఉద్యోగి ప్రజలకు అందించిన సేవలే వారి మనుసుల్లో చిరకాలం గుర్తుంటాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ అన్నారు. గోనెగండ్ల మండలం ఎంఈఓగా పనిచేస్తున్న వినోద్ కుమార్ కర్నూలుకు బదిలీపై వెళ్లిన సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బతకన్న, రహంతుల్లా, చంద్రపాల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం

హొళగుంద: గత కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరలో కోతలు విధిస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నా అధికారులు పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్త చేస్తూ మంగళవారం రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సిందువాళ కృష్ణయ్య, కాకి సీతయ్యతో పాటు రైతులు విద్యుత్ అధికారులు, సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ఆస్పరిలో పూజలందుకుంటున్న సుంకులమ్మవ్వ.



కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

వర్షం కోసం పూజలు

ఆస్పరి: వర్షం కోసం స్థానిక సుంకులమ్మవ్వ ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో కుంభాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, మంగళహారుతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

దేవతలకు కుంభోత్సవం

హొళగుంద: వరుణుడి కటాక్షం కోసం శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం దేవమ్మ, మారెమ్మ అవ్వలకు కుంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక పెద్దబావి వద్ద గంగిపూజ, ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి గంగాజలంతో నింపిన కుంభాలను భక్తులు ఊరేగింపుగా ఆలయాలకు తీసుకెళ్లి అక్కడ అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణ, భజన తదితర కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని భక్తులు ఇళ్లల్లో పిండి వంటలను చేసి అవ్వలకు నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

మద్దికెర : వర్షాలు కురువకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, శ్రావణమాసంలో దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని స్థానిక రామేశ్వరం దేవాలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. 101 టెంకాయలు సమర్పించి 101 బిందెలతోజలాభిషేకం చేశారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమన్న అంశంపై బుధవారం పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్‌హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుబాష్ చంద్రబోస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని సామాజిక వర్గాల నాయకులు హాజరుకావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

వెల్దుర్తి: తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నట్లు, ఈనెల 24, 25వ తేదీలలో జగనన్నకు చెబుదాం, చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు అయ్యస్వామి తెలిపారు. ఆయన మంగళవారం సంఘం ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, మరి కొందరు వీఆర్ఏలతో కలిసి ఆర్ఐ మస్తాన్‌కు వినతిపత్రాన్ని అందించారు. తమ పోరాటానికి సహకరించాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదే అన్నింటికీ ఆధారం

కృష్ణగిరి: రైతులు ప్రభుత్వ పథకాలను అర్హత సాధించాలంటే సాగుచేసిన పంటలను ఈ-క్రాప్‌లో తప్పక నమోదు చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, అమకతాడు గ్రామ సమీపాల్లో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు పంటసాగు చేసినప్పటి నుంచి పంట ఉత్పత్తులు అమ్ముకునే దాకా ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే ఆదుకునేందుకు ఈ-క్రాప్ నమోదే ఆధారంగా తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే రైతు భరోసా, ఉచిత పంటలబీమా, సున్నా వడ్డీ కింద పంట రుణాలు తదతర పథకాలు పొందాలంటే ఈ-క్రాప్ నమోదే ఆధారమని తెలియజేశారు.

గ్రామ సేవకుడి మృతి

గోనెగండ్ల : మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన తలారి కేశన్న (41) అనే గ్రామ సేవకుడు మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన గ్రామ సేవకుడిగా దాదాపు 20 సంవత్సరాలు సేవలందించాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్, వీఆర్వోలు, వీఆర్ఏ సంఘం నాయకులు ఎర్రబాడు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రెవెన్యూ సిబ్బంది రూ.25 వేలు, వీఆర్ఏ సంఘం తరుపున రూ.2 వేలు మృతుడి భార్య మహాలక్ష్మికి అందజేశారు.

భూ రీసర్వేకు సహకరించాలి

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ నిత్యానందరాజు కోరారు. మంగళవారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో సమగ్ర భూ రీసర్వేను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..రీ సర్వేతో భూ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయన్నారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా భూములు సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి సంబరం..!

- పోలీసు కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చిన రౌడీషీటర్లకు టీడీపీ నేతల స్వాగతం
- బాణాసంచా పేల్చుతూ హల్‌చల్

పత్తికొండ రూరల్: జిల్లా కేంద్రమైన కర్నూలులో రౌడీషీటర్లకు పోలీసులు ఇచ్చిన కౌన్సెలింగ్‌కు వెళ్లి వచ్చిన ఓ కేసులో నిందితుడికి టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికి, బాణాసంచా పేల్చి హల్‌చల్ చేసి పట్టణంలో అలజడి సృష్టించారు. ఈనెల 10న మండల పరిధిలోని పుచ్చకాయలమాడలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకుని రాళ్ల దాడి చేశారని పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేశారు. స్టేషన్‌కు హాజరైన నిందితులు బెయిల్ తీసుకున్నారు. అందులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి అల్లుడు శ్రీధర్‌రెడ్డి కూడా ఉన్నాడు. అతడిని మంగళవారం మధ్యాహ్నం విచారణ కోసం పోలీసులు పత్తికొండ పోలీసు స్టేషన్‌కు పిలిచి, అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లారు. ఏం జరిగిందో తెలుసుకోకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సాయంత్రం పత్తికొండకు చేరుకున్న శ్రీధర్‌రెడ్డికి సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు బాణాసంచా పేల్చుతూ స్వాగతం పలుకుతూ.. ర్యాలీగా పార్టీ కార్యాలయానికి వెళ్లడం చూసి జనం ముక్కున వేలేసుకున్నారు. ఇదేం సంబరమని విస్తుపోయారు. ఏం ఘనకార్యం చేశాడని సంబరాలు చేసుకున్నారో అర్థం కాక తలలు గోక్కున్నారు. అసలు విషయం తెలుసుకుని ముక్కున వేలేసుకున్నారు. ఈ విషయంపై సీఐ మురళీమోహన్‌ని వివరణ కోరగా జిల్లాలో పోలీసులపై జరిగిన దాడులకు సంబంధించి కౌన్సెలింగ్‌లో భాగంగా పత్తికొండ నుంచి వీరిని తీసుకెళ్లామని ఆ తరువాత వదిలేసినట్లు తెలిపారు.

ప్రాణాలు కాపాడిన ఎయిర్ బెలూన్స్



ప్రమాదంలో నుజ్జయిన కారు, గాయపడిన డ్రైవర్

వెల్దుర్తి: కారులోని ఎయిర్ బెలూన్స్ వారికి శ్రీరామ రక్షగా నిలిచాయి. కారు అదుపుతప్పి ఆగిఉన్న జీపును వేగంగా ఢీకొనగా అందులోని వారంతా క్షేమంగా బయటపడ్డారు. మంగళవారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు.. అనంతపురం నుంచి కర్నూలుకు డ్రైవర్ లక్ష్మి ప్రశాంత్ పాటు మరో ముగ్గురు యువకులు కారులో బయలుదేరారు. వెల్దుర్తి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన నిలిచున్న బొలెరో క్యాంపర్ జీపును వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ సమయంలో కారు డ్రైవర్, పక్క సీటులోని యువకుడు సీట్‌బెల్ట్ ధరించడంతో కారులోని సేఫ్టీ ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటన జరిగిన వెంటనే స్థానికులు గుమిగూడారు. కారులోని వారు క్షేమంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పగాయాలైన డ్రైవర్‌ను హైవే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణ, నాయకులు

దేవనకొండ : బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆపద సమయాల్లో ఆదుకుంటుందని వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణ అన్నారు. మండలంలోని నేలతలమరి గ్రామానికి చెందిన తలారి చంద్ర వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. బాధిత కుటుంబానికి బీమా కింద మంజూరైన రూ.లక్ష పరిహారాన్ని మంగళవారం అందించారు. మట్టి ఖర్చులకు అంతకముందే రూ.10 వేలను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వలంటీర్ విమల, నాయకులు రాజారెడ్డి, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



సమ్మత్‌గేరి రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఐయూ డీఈ భాస్కర్

ఆలూరు: నియోజకవర్గంలో పీఐయూ ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన బీటీ, సీసీ రోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను పీఐయూ డీఈ భాస్కర్ ఆదేశించారు. మంగళవారం ఆలూరు మండలం హత్తిబెళగళ్, హొళగుంద మండలం సమ్మత్‌గేరి గ్రామాల్లో రూ. 3 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం ఆలూరులోని డీఈ కార్యలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, దేవనకొండ మండలాల పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన 44 బీటీ, సీసీ రోడ్ల నిర్మాణాలకు ఏపీఆర్ఆర్, గ్రాంటు నిధులు సుమారు రూ.67 కోట్లు మంజూరయ్యాయన్నారు. అయితే 14 గ్రామాల రోడ్ల పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు.